సాక్షి
విశాఖపట్నం
శనివారం । 28 । జూన్ । 2025


రథయాత్రలో జనసందోహం



నగరానికి ఎంత నీరు అవసరమంటే..

98 వార్డులకు, పరిశ్రమలకు ఎంత నీరు అవసరం : 86 ఎంజీడీలు

మొత్తం తాగునీటి కనెక్షన్లు	: 3.12 లక్షలు
రెసిడెన్షియల్‌కి	: 50 ఎంజీడీలు
సెమీబల్క్‌కు	: 18 ఎంజీడీలు
బల్క్‌కి	: 18 ఎంజీడీలు

(ఎంజీడీ అంటే మిలియన్ గ్యాలన్స్ పెర్ డే)

రిజర్వాయర్ల నుంచి నీరిలా..

- రైవాడ : 15 ఎంజీడీ
- తాటిపూడి : 10 ఎంజీడీ
- గోదావరి : 33 ఎంజీడీ
- గోస్తనీ : 5 ఎంజీడీ
- మిగిలిన రిజర్వాయర్ల నుంచి 33 ఎంజీడీలు



గ్రేటర్‌కు వాటర్ కట్..!

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి స**రఫరా నిలిచిపోవడంతో నగర** ప్రజలు, పరిశ్రమలు నీటి కోసం అల్లాడుతున్నాయి. ఆప్కాస్ కా**ర్మికులు సమ్మె బాట పట్టడమే** దీనికి కారణం. టౌన్ సర్వే రిజర్వాయర్, నరవ హెడ్ వాటర్ వర్క్స్, **పద్మనాభంతో పాటు పలు** జోనల్ కార్యాలయాల వద్ద కార్మికులు నిరసన తెలుపు**తున్నారు. ఫలితంగా జీవీఎంసీ** పరిధిలోని 98 వార్డులతో పాటు పరిశ్రమలకు తాగునీరు పూర్తి**గా నిలిచిపోయింది. తాగునీటి** విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల డిమాండ్ల పరిష్కా**రంలో అధికారులు, మేయర్** పీలా శ్రీనివాసరావు ఆసక్తి చూపకపోవడంతో ఈ సమ్మెకు **దిగినట్లు కార్మికులు తెలిపారు.**


నరవ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద నిరసన చేస్తున్న కార్మికులు

డాబాగార్డెన్స్: ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మెతో నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో పర్మినెంట్ ఉద్యోగులతో కొంతమేర నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ, అది అరకొర గానే ఉండటంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం రోడ్ల మీదకు వచ్చి నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారు. ముఖ్యంగా కొండవాలు ప్రాంతాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

కార్మికులు ఎందుకు సమ్మె చేస్తున్నారంటే..

ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల్లో

ఆప్కాస్ కార్మికులు సమ్మె బాట
పట్టించుకోని అధికారులు, మేయర్
ప్రజలకు నీటి కష్టాలు

పదేళ్లు అనుభవం ఉండి, టెక్నికల్ విధులు నిర్వహిస్తు న్న సుమారు 900 మందిని సెమీ స్కిల్ కేటగిరీలో చేర్చి, ఆ మేరకు వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాలు గత కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. గతేడాది డిసెంబర్‌లో జీవీఎంసీ కౌన్సిల్ వేతనాల పెంపునకు ఆమోదం తెలపగా, అధికారులు మే నెల నుంచి నెలకు రూ.6 వేలు పెంచుతూ ఆప్కాస్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అయితే ఆచరణలో పాత వేతనాలే చెల్లించడంతో పాటు, జూన్ నెల జీతాలు కూడా పాత పద్ధతిలోనే అప్‌లోడ్ చేయడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతన పెంపు అమలు చేయాలంటూ కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో నగరంలో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి

తాగునీటి విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెలో ఉన్నప్పటికీ, ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసిన మేయర్, అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

నీటి సరఫరా ప్రభావంపై అంచనా వేస్తున్నాం..



ఆప్కాస్ కార్మికుల సమ్మె కారణంగా నీటి సరఫరాపై ప్రభావాన్ని అంచనా వేస్తున్నాం. గురువారం పంపింగ్ జరిగింది. ఉన్న నీటిని నగర పౌరుల అవసరాలకు పర్మినెంట్ వర్కర్స్‌తో ట్యాంకుల ద్వారా పంపిణీ చేస్తున్నాం.

– **కేవీఆర్‌ఎస్ రవి**, పర్యవేక్షక ఇంజనీర్, జీవీఎంసీ తాగునీటి విభాగం

జీవో 7 ప్రకారం వేతనాలు అమలు చేయాలి..



జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీవో 7 ప్రకారం వేతనాలు అమలు చేయాలి. కార్పొరేషన్ తీర్మానం (2024 డిసెంబర్ 11) ప్రకారం వేతనాలు పెంచేందుకు ఐదు నెలల క్రితం ఆప్కాస్ పోర్టల్‌లో ప్రక్రియ పూర్తై, బిల్లులు కూడా జనరేట్ అయ్యాయి. అయితే, కొన్ని కారణాలతో పాత వేతనాల బిల్లులనే తిరిగి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ విషయంపై 15 రోజుల క్రితం అధికారులు, మేయర్‌కు ఫిర్యాదు చేయగా, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోవడంతో సమ్మెకు సిద్ధమయ్యాం.

– **మహాదేవ్ ఆనందరావు**, గౌరవ అధ్యక్షుడు, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్

అధికారులు స్పందించకపోవడం దారుణం



కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందినప్పటికీ అధికారులు చర్యలు చేపట్టకపోవడం దారుణం. ఈ విషయమై 15 రోజుల క్రితం అధికారులు హామీనిచ్చారు. ఇచ్చిన హామీ కూడా నిలబెట్టుకోలేదు. తప్పని పరిస్థితుల్లో సమ్మె బాట పట్టాల్సి వచ్చింది.

– **రెల్లి సత్యం**, ప్రధాన కార్యదర్శి, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్



జయహో జగన్నాథ

జగన్నాథ రథచక్రాల కదలికతో విశాఖ నగరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. హరే కృష్ణ నామస్మరణలు, సంకీర్తనల హోరు, రథచక్రాల గిరగిరలు, భక్తుల కోలాటం మధ్య నగరం భక్తి పారవశ్యంలో మునిగితేలింది. పలుచోట్ల జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు అత్యంత వైభవంగా, కనుల పండువగా జరిగాయి.'జై జగన్నాథ' నినాదాలతో వీధులు మార్మోగాయి. ఈ ఆధ్యాత్మిక సందడిలో పాల్గొనేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు, స్వామి రథాన్ని లాగి తమను తాము ధన్యులుగా భావించారు. రథయాత్ర సాగే మార్గాల్లో భక్తులు హారతులిచ్చి, పూలు చల్లుతూ భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. రథంపై కొలువై ఉన్న స్వామిని కనులారా చూసేందుకు భక్తులు బారులు తీరారు.

8లో

జైలులో సౌకర్యాలపై ఆరా


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని శుక్రవారం న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని ఖైదీల బ్యారక్‌లను పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడిన సన్యాసినాయుడు, వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రత వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలులో ప్రస్తుతమున్న ఖైదీల సంఖ్య, వారి ప్రవర్తన గురించి జైలు అధికారుల నుంచి సమాచారం సేకరించారు. అనంతరం కారాగారం న్యాయ సహాయ కేంద్రంలో రిమాండ్ ఖైదీలతో మాట్లాడి, వారికి అవసరమైన న్యాయ సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు కె. జవహర్ బాబు, సి. ప్రవీణ్ కుమార్, ఇతర జైలర్లు పాల్గొన్నారు.

9న ఆటోల బంద్

డాబాగార్డెన్స్: రాడార్ సిస్టం, మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం రద్దు చేయాలని కోరుతూ జూలై 9న ఆటోలు బంద్ పాటిస్తున్నట్టు వివిధ ఆటో యూనియన్ల నాయకులు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపంలోని సిటు కార్యాలయంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్న రాడార్ వ్యవస్థను వెంటనే రద్దు చేయాలన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి యాప్‌ల్లో అమలు చేస్తున్న రాడార్(ఒకేసారి ఐదుగురికి పికప్ ఇవ్వడం) వ్యవస్థ డ్రైవర్లపై ఒత్తిడి పెంచుతోందనన్నారు. ఈ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా.. కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన యాప్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం రద్దు చేయాలన్నారు. విశాఖ ఆటోరిక్షా కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు బి.జగన్, అధ్యక్షుడు పి.రాజుకుమార్, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా నాయకులు బి.శేషు, కె.వేణు, జె.గోవింద్, ఎల్.రామకృష్ణ, జి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంజనకు 'శోభానాయుడు యువ పురస్కార్'



అమెరికాలో నివసిస్తున్న ప్రముఖ కూచిపూడి నర్తకి సంజనా పుట్టాకు జూలై 4న విశాఖపట్నంలో 'పద్మశ్రీ డా. శోభానాయుడు యువ పురస్కార్ - 2025' ప్రదానం చేయనున్నట్లు నటరాజ్ మ్యూజిక్ - డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు బి.ఆర్. విక్రమ్ కుమార్ ప్రకటించారు. ఈ పురస్కారాన్ని భారతీయ శాస్త్రీయ నృత్య కళలలో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి అందజేస్తారు. సంజన 12 సంవత్సరాలుగా గురువు శ్రీలత సూరి శిక్షణలో కూచిపూడి నృత్యంలో సాధన చేసి, అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఆమె 2024లో రంగప్రవేశం పూర్తి చేసి, ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, ఆస్టిన్‌లో ప్రీ-మెడ్ విద్యార్థినిగా ఉన్నారు. క్యాంపస్‌లో భారతీయ కూచిపూడి నృత్యాన్ని పరిచయం చేయడంలో ఆమె విశేష కృషి చేస్తున్నారు.

- మద్దిలపాలెం

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవివర్మ


శ్రీదేవివర్మ

మహారాణిపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా పెనుమత్స శ్రీదేవివర్మను నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

నేటితో ముగియనున్న పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిసెట్ కౌన్సెలింగ్ శనివారంతో ముగియనుంది. శుక్రవారం మొత్తం 386 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. జీఐఈటీఎస్ లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ సిహెచ్. జయప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 104001 నుంచి 112000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 152 మందికి సర్టిఫికెట్లు పరిశీలించగా, వారిలో 112 మంది బీసీ, 17 మంది ఓసీ, 23 మంది ఎస్సీ విద్యార్థులు ఉన్నారు.పాలిటెక్నిక్ కాలేజీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో, జనరల్ హెడ్, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. భాషా, లెక్చరర్ నాగరాజు ఆధ్వర్యంలో 112001 నుంచి 120000 ర్యాంకుల వరకు కౌన్సెలింగ్ జరిగింది. ఇక్కడ 234 మందికి సర్టిఫికెట్లు పరిశీలించగా, 166 మంది బీసీ, 26 మంది ఓసీ, 30 మంది ఎస్సీ, 12 మంది ఎస్టీ విద్యార్థులు ఉన్నారు. శనివారం జీఐఈటీఎస్‌లో 1,20,001 నుంచి 1,27,000 ర్యాంకు వరకు ఉన్న విద్యార్థులు హాజరు కావాలి. పాలిటెక్నిక్ కాలేజీలో 1,27,001 నుంచి చివరి ర్యాంకు వరకు ఉన్న విద్యార్థులు హాజరు కావాలి.ఎస్టీ విద్యార్థులందరూ పాలిటెక్నిక్ కాలేజీకి హాజరు కావాల్సి ఉంటుంది.

నిమిషానికి ఒకటిన్నర అంశం.. ఇదేం చర్చో?

- నాలుగు గంటల్లో 299 అంశాలపై చర్చ
- జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంపై విమర్శలు


స్థాయీ సంఘ సమావేశంలో అంశాలు చర్చిస్తున్న మేయర్, స్థాయీ సంఘం సభ్యులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో కేవలం నాలుగు గంటల వ్యవధిలో ఏకంగా 299 అజెండా అంశాలపై జరిగిన చర్చ.. చర్చనీయాంశంగా మారింది. సగటున ఒక్కో అంశానికి నిమిషం కన్నా తక్కువ సమయం కేటాయించడంపై, కీలకమైన నగర సమస్యలపై తూతూమంత్రంగా జరిపిన చర్చపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు మూడు నెలలు తర్వాత మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం తొలి స్థాయీ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారుల తీరు మొక్కుబడిగా ఉందని మేయర్ చిర్రుబుర్రులాటారు. 'ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ ఆ మాత్రం పనిచేయకపోతే ఎలా? జీవీఎంసీ ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత మీపై లేదా? పూర్తి సమాచారం లేకుండా సమావేశానికి రావొద్దు'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, అధికారులకు ఇంతటి క్లాస్ తీసుకున్న మేయర్ అధ్యక్షతన జరిగిన సమావేశం తుఫాన్ వేగంతో ముగియడం విమర్శలకు తావిస్తోంది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం గంట ఆలస్యంగా 12 గంటలకు మొదలైంది. అప్పటి నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. అంటే కేవలం నాలుగు గంటల పాటు మాత్రమే సమావేశం జరిగింది. ఈ సమయంలోనే 286 సాధారణ, 13 టేబుల్ అజెండాతో కలిపి మొత్తం 299 అంశాలను సభ్యులు చర్చించారు. వీటిలో 239 అంశాలను ఆమోదించగా, 60 అంశాలను వాయిదా వేశారు. ఇంజినీరింగ్, రెవెన్యూ, కాంట్రాక్టులు, పరిపాలన, ప్రజారోగ్యం వంటి అత్యంత కీలకమైన, అంశాలపై నిమిషాల వ్యవధిలో ఎలా కూలంకషంగా చర్చించి ఉంటారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల అలసత్వంపై మండిపడి.. ఇలా నామమాత్రంగా సమావేశం ముగించడం ఎంతవరకు సమంజసమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు ఇప్పినాయుడు, కె.శివప్రసాద్, మల్లయ్యనాయుడు, బి.రాము, బీఆర్.ఎస్.శేషాద్రి, హేమావతి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, యూసీడీ పీడీ పీఎం సత్యవేణి, సెక్రటరీ బీవీ రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, పరిపాలనాధికారి పద్మజ, పర్యవేక్షక ఇంజనీర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు రూ.3,200 కోట్లు


మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

మహారాణిపేట : రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం రూ. 3,200 కోట్ల అదనపు ఆర్థిక సాయం అందించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మంజూరైన 1.89 లక్షల ఇళ్లలో 43 వేలు పూర్తయ్యాయని, మిగిలినవి 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, గిరిజన ప్రాంతాల్లోని ఎస్టీలకు రూ. 1 లక్ష అదనపు సాయం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నాణ్యత, మౌలిక సదుపాయాలపై దృష్టి పెడతామని, పనులు వదిలేసిన గుత్తేదారులపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు.

పేదలందరికీ ఇళ్లు : పేదలందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. విశాఖ కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే నాలుగేళ్లలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే లేఅవుట్లపై కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని ఆయన వివరించారు. మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా విద్యుత్, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తాగునీటి కోసం జీవీఎంసీ నుంచి నిధులతో పాటు ప్రభుత్వం నుంచి కూడా నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, ఆర్డీవో సంగీత్, హౌసింగ్ సీఈ రామ్మోహన్‌రావు, హౌసింగ్ పీడీ సత్తిబాబు, సంబంధిత హౌసింగ్ ఈఈలు, డీఈలు, పంచాయతీ రాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

మానవ మృగానికి ఉరే సరైన శిక్ష

- ఆరుగుర్ని హత్య చేసిన నిందితుడికి ఉరి శిక్ష విధిస్తూ తీర్పు
- నాలుగేళ్ల క్రితం జుత్తాడలో ఘోర సంఘటన


భార్య ఉషారాణి, ఇద్దరు కుమారులతో విజయ్(ఫైల్)


మృతులు రమాదేవి, అరుణ (ఫైల్)

పెందుర్తి: పెందుర్తి మండలం వి.జుత్తాడలో నాలుగేళ్ల క్రితం(2021 ఏప్రిల్ 15న) జరిగిన దారుణ హత్యల కేసులో నిందితుడు బత్తిన అప్పలరాజుకు జిల్లా కోర్టు శుక్రవారం మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు చెప్పింది. ఈ తీర్పుతో బాధిత కుటుంబం, స్థానికులు న్యాయం లభించిందని భావిస్తున్నారు. ఈ ఘటనలో ఇద్దరు పసిపిల్లలతో సహా ఆరుగురు నిద్రమత్తులోనే ప్రాణాలు కోల్పోగా, అప్పటి నుంచి న్యాయం కోసం నిరీక్షిస్తున్న కుటుంబానికి ఈ తీర్పు కొంత ఊరటనిచ్చింది.

అనుమానమే ఆరుగురి ప్రాణాలు తీసింది

2021 ఏప్రిల్ 15 తెల్లవారుజామున జుత్తాడ గ్రామం రక్తసిక్తమైంది. నిందితుడు బత్తిన అప్పలరాజు కుమార్తెకు, అదే గ్రామానికి చెందిన బమ్మిడి విజయ్‌కిరణ్‌కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఇరు కుటుంబాల మధ్య దీర్ఘకాలంగా వివాదం నడుస్తోంది. ఈ పగతో రగిలిపోయిన అప్పలరాజు.. విజయ్‌కిరణ్ కుటుంబంపై ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. ఆ రోజు ఉదయం వారింట్లోకి ప్రవేశించి నిద్రలో ఉన్న బమ్మిడి రమణ(63), బమ్మిడి ఉషారాణి(35), అల్లు రమాదేవి(53), నక్కెళ్ల అరుణ(40), బమ్మిడి ఉదయ్‌నందన్ (2), బమ్మిడి ఉర్విష విజయ్‌కిరణ్(6 నెలలు)లను కత్తితో అత్యంత పాశవికంగా హతమార్చాడు. అభంశుభం తెలియని పసికందులను కూడా వదలకుండా చంపడం అందరినీ కలచివేసింది. రక్తపు మడుగులో మృతదేహాల దృశ్యం చూసిన వారందరినీ కన్నీరు పెట్టించింది.

న్యాయం దిశగా ...

ఈ దారుణ ఘటన అనంతరం అప్పలరాజు పోలీసులకు లొంగిపోయాడు. ప్రభుత్వం కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించి, బాధిత కుటుంబానికి అండగా నిలబడింది. నష్టపరిహారం చెల్లించి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చింది. పోలీసులు ఈ కేసును అత్యంత పకడ్బందీగా విచారించి కోర్టులో నివేదించారు. నాలుగేళ్ల సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం, ఈ రోజు విశాఖ కోర్టు అప్పలరాజుకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

బాధిత కుటుంబ సభ్యుల ఆనందం

ఈ తీర్పుపై బాధిత కుటుంబ సభ్యులు నాటి ఘటనను తల్చుకుని కన్నీరు పెట్టుకుంటూనే తమ ఆనందం వ్యక్తం చేశారు. 'మానవ మృగానికి ఉరే సరైన శిక్ష. మా కుటుంబానికి న్యాయం జరిగింది' అని తెలిపారు. ఈ తీర్పు భవిష్యత్తులో ఇలాంటి దారుణాలకు పాల్పడే వారికి ఒక హెచ్చరికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

కదిలిన జగన్నాథ రథం

కదిలిన జగన్నాథ రథచక్రాలతో నగరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. హరే కృష్ణ నామస్మరణలు, సంకీర్తనల హోరు.. రథ చక్రాల గిరగిరలు.. భక్తుల కోలాహలం మధ్య భక్తి పారవశ్యంలో మునిగితేలింది. నగరంలో పలుచోట్ల జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు అత్యంత వైభవంగా, కనుల పండువగా జరిగాయి. జై జగన్నాథ నినాదాలతో వీధులు మార్మోగాయి. ఈ ఆధ్యాత్మిక సందడిలో పాల్గొనేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చి, స్వామి రథాన్ని లాగి తరించారు.

– దాబాగార్డెన్స్/ఎంవీపీకాలనీ/బీచ్‌రోడ్డు

కదిలొచ్చిన జనం

- వైభవంగా రథయాత్ర ప్రారంభం
- హరేకృష్ణ నామస్మరణతో భక్తుల నృత్యాలు
- నగరంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



బలభద్ర, సుభద్ర, జగన్నాథ స్వామి వేషధారణలో..



ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

టౌన్ కొత్తరోడ్డులో..

185 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయంలో రథయాత్ర శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. వేదమంత్రాలు, గీతా పారాయణం, మేళతాళాలు, కోలాటం నడుమ టౌన్ కొత్తరోడ్డు, ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, పూర్ణామార్కెట్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా టర్నర్ చౌల్ట్రీ వరకు రథయాత్ర సాగింది. అనంతరం బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడిని టర్నర్ చౌల్ట్రీలోని కల్యాణ మండపంలోకి ఆహ్వానించారు. ఆలయ ఈవో టి.రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ యాత్రలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ ప్రధాన అర్చకులు పాణంగిపల్లి రంగానాథాచార్యులు, జగన్నాథాచార్యులు, యేడిద సురేష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. టర్నర్ చౌల్ట్రీ వేదికగా శనివారం నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు స్వామి దశావతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శనివారం మత్స్యావతారంలో స్వామిని అలంకరిస్తామని ఈవో తెలిపారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. సాగర్‌నగర్ ఇస్కాన్ శాఖ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయి సేవిని సారథ్యంలో సాయంత్రం 4 గంటలకు నాలుగు రథాలతో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద యాత్ర ప్రారంభమైంది. ఎల్‌ఐసీ, అంబేడ్కర్ కూడలి, దాబాగార్డెన్స్, ప్రెస్‌క్లబ్ జంక్షన్, జగదాంబ జంక్షన్, గ్రీన్‌పార్కు, వాల్తేర్ అప్‌రోడ్డు మీదుగా సిరిపురం గురజాడ కళాక్షేత్రం వరకు యాత్ర సాగింది. అక్కడ ప్రత్యేక వేదికపై స్వామి వార్లను అధిష్ఠింపజేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబదాస్ జగన్నాథుడి ఔన్నత్యాన్ని వివరించగా, మాతాజీ నితాయి సేవిని స్వామి లీలలను ప్రవచించారు. భక్తులు తయారు చేసిన 1,008 రకాల ప్రసాదాలను స్వామికి నివేదించి, అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. మహానగరంలో వరుసగా 18వ సారి ఈ యాత్రను వైభవంగా నిర్వహించినట్టు సాంబదాస్, మాతాజీ నితాయి సేవిని తెలిపారు. కో–ఆర్డినేటర్ ఎంవీ రాజశేఖర్, ఇస్కాన్ జీవితకాల సభ్యులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు



ఆకట్టుకున్న దశావతారాల వేషధారణలు



హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో..

ఎంవీపీ కాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన రథయాత్రకు భక్తులు పోటెత్తారు. స్వామి రథాన్ని లాగేందుకు ఉత్సాహం చూపారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఎం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర డబుల్ రోడ్డు, టీటీడీ కూడలి, ఇసుకతోట, వెంకోజీపాలెం, క్యాన్సర్ హాస్పిటల్, అప్పుఘర్ బీచ్‌రోడ్డు మీదుగా సాగి తిరిగి ఐఐఎంకు చేరుకుంది. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథం, యాత్రలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక, మంగళహారతి కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించన భక్త దాస తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రథయాత్రలో భారీగా పాల్గొన్న భక్తులు(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామి

ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో..



ఉత్కళ్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో దసపల్లాహిల్స్‌లోని జగన్నాథ ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. సమాజ్ అధ్యక్షుడు జె.కె.నాయక్ రథం ముందు కొబ్బరి కాయ కొట్టి, మార్గాన్ని శుభ్రం చేసి యాత్రను ప్రారంభించారు. పుష్పాలతో అలంకరించిన రథంపై సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు అధిష్ఠించాడు. భక్తుల కోలాహలం నడుమ ఆల్ ఇండియా రేడియో, సిరిపురం, ఏయూ అవుట్‌గేట్, చినవాల్తేరు, వీఎంఆర్డీఏ పార్క్ మీదుగా లాసన్స్ బే కాలనీ వరకు యాత్ర సాగింది. ఈ యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు.



భక్తజన సందోహం మధ్య సాగుతున్న రథయాత్ర

ఎమర్జెన్సీ కాలం చీకటి అధ్యాయం

బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వి

సీతంపేట: బంగ్లాదేశ్ విమోచనతో శక్తివంతమైన నాయకురాలిగా ఎదిగిన ఇందిరా గాంధీ 1975లో విధించిన ఎమర్జెన్సీతో ప్రజల స్వేచ్ఛను హరించారని బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు ఎల్.ఎస్.తేజస్వి సూర్య ఆరోపించారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్.పరశురామ్ అధ్యక్షతన 'చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు' అనే అంశంపై పోర్టు కళావాణి స్టేడియంలో శుక్రవారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా తేజస్వి మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో ఎంతో మందిని జైలు పాలు చేశారని, సుమారు కోటి మందికి బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించారన్నారు. ఇవన్నీ కాంగ్రెస్ దేశ ప్రజలకు చేసిన ద్రోహాలని తేజస్వి విమర్శించారు. ఎమర్జెన్సీ విధించడానికి దారితీసిన పరిస్థితులు, ప్రజలు పడ్డ కష్టాలను ఆయన వివరించారు. ఈ చీకటి అధ్యాయాన్ని నేటి యువత తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం అనుభవించిన పలువురిని ఘనంగా సన్మానించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ధోని నాగరాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీ కృష్ణ, బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ.కేశవకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వి

మూడు కాళ్ల కోడి



పద్మనాభంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న చికెన్ షాపులో మూడు కాళ్ల బ్రాయిలర్ కోడి ఒకటి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ వింత కోడిని చూసేందుకు చికెన్ కోసం వచ్చిన వారే కాకుండా, రోడ్డుపై వెళ్లే పాదచారులు కూడా గుమిగూడారు. మొత్తానికి ఈ మూడు కాళ్ల కోడి అందరి దృష్టిని ఆకర్షించి వింతగా నిలిచింది.

– పద్మనాభం

దేశ నిర్మాణంలో యువత కీలకం



యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్ తదితరులు

ఆరిలోవ: యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో శుక్రవారం సీఐఐ యువ విభాగం యంగ్ ఇండియన్స్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియన్ పార్లమెంట్ 2.0' కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోని సుమారు 100 మంది ప్రతిభావంతులైన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారంతా ఆసక్తికరమైన అంశాలతోపాటు వాస్తవిక చర్చలు, వాదనలు, శాసన ప్రక్రియల అనుకరణ తదితర వాటి గురించి చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎంపీ మాట్లాడుతూ యువ పార్లమెంటీరియన్లతో తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, యంగ్ ఇండియన్ వైజాగ్ చైర్మన్ డాక్టర్ శ్రావణి, కో చైర్మన్ దీప, సుప్రియ పాల్గొన్నారు.

జీవో 114పై క్రెడాయ్ హర్షం

విశాఖ సిటీ: రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం జీవో నంబర్ 114 జారీ చేయడంపై క్రెడాయ్ విశాఖపట్నం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ జీవోతో నిర్మాణ రంగంలో పారదర్శకత పెరుగుతుందని, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటాయని క్రెడాయ్ నిర్వాహక సంఘ సభ్యులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇది మేలు చేయడంతో పాటు పెట్టుబడుల ఆకర్షణకు మార్గం సుగమం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ జీవోతో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుందని, తద్వారా విశాఖ నగరాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

అప్పన్న దేవస్థానం సూపరింటెండెంట్ సస్పెన్షన్

సింహాచలం: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందుకు సింహాచలం దేవస్థానం అన్నదానం విభాగం సూపరింటెండెంట్ త్రిమూర్తులను దేవస్థానం ఈవో త్రినాథరావు సస్పెండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవస్థానాల్లో అన్నప్రసాదం నాణ్యతను తెలుసుకునేందుకు భక్తుల ఫోన్ నంబర్లు సేకరించి ప్రభుత్వానికి పంపించాలి. ప్రభుత్వం ఆ భక్తులకు ఫోన్ చేసి అన్నప్రసాదంపై అభిప్రాయాలను అడుగుతుంది. సింహాచలం దేవస్థానంలో రోజుకు సుమారు 1000 మంది భక్తుల ఫోన్ నంబర్లను సేకరించి ప్రభుత్వానికి పంపించాల్సి ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడంలో త్రిమూర్తులు నిర్లక్ష్యం వహించారని ఈవో పేర్కొన్నారు. అయితే దేవస్థానంలో చాలామంది ఉద్యోగులకే ఈ పద్ధతి గురించి తెలియదని సమాచారం. ఈ సస్పెన్షన్‌పై త్రిమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆలయ పర్యవేక్షకుడిగా విధులు నిర్వర్తిస్తున్నానని, అన్నదానం అదనపు బాధ్యతలు తనకు కేవలం వారం రోజుల క్రితమే అప్పగించారని ఆయన తెలిపారు.

ఎస్సీ యువత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈడీ సత్యపద్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఎం అజాయ్ పథకంలో భాగంగా 18 నుంచి 40 ఏళ్ల లోపు యువతకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. గాజువాక, గాజువాక కేంద్రాల్లో ఈ శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత మధ్యాహ్న భోజనం, స్టేషనరీ ఇస్తారని చెప్పారు. ఆసక్తి గల వారు వివరాలకు 79810 22453, 90632 69849 నంబర్లలో సంప్రదించాలని ఈడీ కోరారు.

ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్‌లోకి డీటీవో కార్యాలయం

మహారాణిపేట: కలెక్టరేట్ వెనుక నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్‌లోకి జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని(డీటీవో) మార్చారు. శుక్రవారం ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారి గోవిందరావు ఈ మార్పును లాంఛనంగా ప్రారంభించారు. ఈ భవన నిర్మాణం ఎప్పుడో పూర్తయినప్పటికీ.. వివిధ కారణాల వల్ల డీటీవో కార్యాలయ మార్పు వాయిదా పడుతూ వచ్చింది. కలెక్టరేట్ ఆవరణలోని డీటీవో కార్యాలయం వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండిపోతూ ఉంది. ఇటీవల వర్షాలకు కార్యాలయంలో కొంత భాగం పాక్షికంగా కూలిపోయి, నాల్గవ తరగతి ఉద్యోగి ఒకరు గాయపడ్డారు. రెండు రోజుల కిందట కురిసిన వర్షాలకు రికార్డులు తడిసిపోయాయి. అలాగే కొంత మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఉద్యోగులు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా, కలెక్టర్ తక్షణమే కార్యాలయాన్ని మార్చాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం హడావిడిగా మార్పులకు శ్రీకారం చుట్టారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలోనే నిర్మాణం పూర్తి : జిల్లా పరిషత్‌కు సమీపంలో, కలెక్టర్ కార్యాలయం వెనుక రూ.25.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్ పనులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే తుది దశకు చేరుకున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేయడం కారణంగా చివరి దశ పనులు పూర్తి కాలేదు. దీంతో 2024లోనే వినియోగంలోకి రావాల్సిన ఈ కాంప్లెక్స్‌లో విద్యుత్ పనులు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఇతర పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

రేపు విద్యుత్ బిల్లులు చెల్లింపునకు అవకాశం

ఎంవీపీకాలనీ: ఈ నెల 29వ తేదీ ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లింపునకు ఏపీఈపీడీసీఎల్ అవకాశం కల్పించింది. ఈ మేరకు సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.శ్యామ్‌బాబు శుక్రవారం తెలిపారు. అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఈపీడీసీఎల్ కౌంటర్లలో వినియోగదారులు ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు.